
# బీజేపీ బలోపేతమే లక్ష్యం

**డాక్టర్ అనూప్ రావు**



**నేటి సాక్షి,కోరుట్ల (రాధారపు) నర్సయ్య):** బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ అనూప్ రావు బుధవారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావుని మర్యాదపూర్వకంగా కలిశారు. జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబుతో కలిసి వెళ్లిన ఆయన, తనకు ఈ కీలక బాధ్యతను అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో భారతీయ జనతా పార్టీని మరింత క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, రాబోయే రోజుల్లో పార్టీని అత్యంత శక్తివంతమైన శక్తిగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని డాక్టర్ అనూప్ రావు తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఉచిత కంటి వైద్య శిబిరం

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**



**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ డ్రైవర్లకు జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర కీలకమని, కంటి చూపు స్పష్టంగా ఉంటేనే ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రహదారి సూచనలను గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని పేర్కొన్నారు. వయస్సు పెరిగే కొద్దీ వచ్చే కంటి సమస్యలను గుర్తించేందుకు డ్రైవర్లు తరచూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించడంతో పాటు అవసరమైన వారికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చికిత్స అందిస్తామని ఎస్పీ తెలిపారు. డ్రైవర్లు తప్పనిసరిగా 'డిఫెన్స్ డ్రైవింగ్' పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సీట్ బెల్ట్ మరియు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని హెచ్చరించారు. ఈ శిబిరం ద్వారా 100 మందికి పైగా డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, ఆర్డీవో రామ్ చందర్, డీఎంహెచ్ఓ జయ చంద్ర మోహన్, ఆర్టీఓ మేఘా గాంధీ, సీఐ శివశంకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హరి నారాయణ బట్టడ్, వైద్యులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మల్లన్నసాగర్ బాధితులకు ఊరట

**కోర్టు తీర్పు హర్షణీయం**



**నేటి సాక్షి గజ్వేల్ :** మల్లన్నసాగర్ ప్రాజెక్టు ముంపు బాధిత గ్రామాల్లోని ఒంటరి మహిళలు, ఒంటరి పురుషులను కుటుంబంగా పరిగణించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోర్టు ఇచ్చిన తీర్పును సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి స్వాగతించారు. బాధితుల పక్షాన తీర్పు రావడం హర్షనీయమని, ఈ తీర్పుతో ప్రజల్లో కోర్టులపై నమ్మకం మరింత పెరిగిందని ఆయన అన్నారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మల్లన్నసాగర్ ముంపు పరిధిలోని గ్రామాల్లో ఒంటరి మహిళలు, పురుషులకు ప్యాకేజీలు ఇవ్వకుండా గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. తమను కూడా కుటుంబంగా గుర్తించి ప్యాకేజీలు అందించాలని బాధితులు కోరినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. అలాగే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పటివరకు ఈ అంశంపై ఎలాంటి స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. గత ఎనిమిదేళ్లుగా న్యాయం కోసం పోరాడుతూ కోర్టును ఆశ్రయించిన బాధితులకు తాజాగా అనుకూల తీర్పు రావడం ముంపు బాధిత గ్రామ ప్రజల విజయమని అన్నారు. బాధితుల తరపున న్యాయపోరాటానికి సహకరించిన న్యాయమూర్తులకు, గ్రామ యువతకు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారని చెప్పారు. కోర్టు తీర్పును అమలు చేసి బాధితులకు వెంటనే ప్యాకేజీలు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కోర్టుకు వెళ్లని మిగతా ఒంటరి మహిళలు, పురుషులను కూడా కుటుంబాలుగా గుర్తించి వీలైనంత త్వరగా ప్యాకేజీలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇంకా పరిహారం, ప్యాకేజీలు అందని బాధితులను ఆదుకోవడంతో పాటు ముంపు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో ప్రభుత్వం భవిష్యత్తులో ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని బండ్ల స్వామి హెచ్చరించారు.

# ఎల్లారెడ్డి హాస్టల్ విద్యార్థిని మృతి

## ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

- ముఖ్యమంత్రి వెంటనే బాధ్యత వహించాలి: కంచర్ల రవి గౌడ్ డిమాండ్
- బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వెల్లడి




**నేటి సాక్షి,సిరిసిల్ల(శివకుమార్):** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి బీసీ బాలికల హాస్టల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థిని శ్రావణి మృతి చెందడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ మండిపడ్డారు. గురువారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి హాస్టల్ విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొద్ది నెలల్లోనే 140 మందికి పైగా విద్యార్థులు మరణించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి, హాస్టళ్లలో జరుగుతున్న వరుస మరణాలపై కనీసం సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవడం బాధ్యతారాహిత్యమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ హయాంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన గురుకుల వ్యవస్థ, ప్రస్తుత పాలనలో కుప్పకూలుతోందని ఆరోపించారు. మృతి చెందిన శ్రావణి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ. 25 లక్షల నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అరెల్లి వినయ్ కుమార్, సాదు శేఖర్, ఎండి సమీర్, హరీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు

- అధికారులను నిలదీసిన సర్పంచ్ సుధాకర్
- సర్వసభ్య సమావేశంలో కొండ్రోనిపల్లి సమస్యలపై గళమెత్తిన సర్పంచ్
- వెంటనే నీటి సరఫరా పునరుద్ధరించాలని జడ్పీ సీఈఓ ఆదేశం



**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** ధన్వాడ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం అధికారుల నిలదీతలతో వాడివేడిగా సాగింది. కొండ్రోనిపల్లి గ్రామ సర్పంచ్ సుధాకర్ సమావేశంలో మాట్లాడుతూ.. తమ గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదని, పదిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు మంచినీటి కోసం అల్లాడుతున్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన నిలదీశారు. దీనిపై స్పందించిన జిల్లా జడ్పీ సీఈఓ.. వెంటనే కొండ్రోనిపల్లికి నీటి సరఫరా జరిగేలా చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులను హెచ్చరించారు. అనంతరం సర్పంచ్ సుధాకర్ మరికొన్ని కీలక అంశాలను సభ దృష్టికి తెచ్చారు. అధికారుల ఆదేశాల మేరకు రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన మొక్కల నర్సరీని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని వివరించారు. దీనిపై విచారణ జరిపి వెంటనే నర్సరీని పునరుద్ధరించాలని సీఈఓ ఆదేశించారు. గ్రామానికి నిధులు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన సర్పంచ్.. కొండ్రోనిపల్లిని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# తెలంగాణపై తేజస్వీ సూర్య వ్యాఖ్యలు దుర్మార్గం

**మాదాసు శ్రీనివాస్**



**నేటి సాక్షి,గజ్వేల్ :** లోక్‌సభలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై చర్చ సందర్భంగా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దేశ విభజనతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలను గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల దశాబ్దాల పోరాటాన్ని, అమరవీరుల త్యాగాలను కించపరిచేలా మాట్లాడటం అత్యంత అవమానకరమని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏ ఒక్కరి దయ వల్ల ఏర్పడలేదని, కోట్లాది మంది ఆకాంక్షలు మరియు కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష వంటి వీరోచిత పోరాటాల ఫలితంగా రాజ్యాంగబద్ధంగా ఏర్పడిందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ పోరాట చరిత్ర పట్ల బీజేపీకి మొదటి నుంచీ గౌరవం లేదని, గతంలో ప్రధాని మోదీ సైతం అనుచిత వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. పార్లమెంట్‌లో తెలంగాణను అవమానిస్తున్నా రాష్ట్ర ఎంపీలు మౌనంగా ఉండటం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం లోక్‌సభలో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం లేకపోవడం వల్లే తెలంగాణ గొంతుక వినిపించకుండా పోయిందని వ్యాఖ్యానించారు. తేజస్వి సూర్య తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీని తెలంగాణ వ్యతిరేక పార్టీగా ప్రజలు పరిగణిస్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, కొమురయ్య, మధుసూదన్ రెడ్డి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా 'పోషణ పక్వాడ' కార్యక్రమం
- చిన్నారులకు అన్నప్రాశన, గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించిన చైర్‌పర్సన్



**నేటి సాక్షి,కోరుట్ల(రాధారపు నర్సయ్య):** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పోషకాహారం పునాది వంటిదని కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ పేర్కొన్నారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలోని భీమునిదుబ్బ-1 అంగన్వాడీ కేంద్రంలో గురువారం 'పోషణ పక్వాడ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారానే రక్తహీనత వంటి సమస్యలను దూరం చేసుకోవచ్చని సూచించారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ ఇంట్లో తయారు చేసిన పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, ఎత్తు మరియు బరువులను రిజిస్టర్లలో నమోదు చేస్తూ వారి ఆరోగ్య స్థితిని గమనిస్తున్నామని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాస కార్యక్రమాలను చైర్‌పర్సన్ చేతుల మీదుగా నిర్వహించారు. గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించి వారికి పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. అంగన్వాడీ కేంద్రాలు కేవలం ఆహార పంపిణీకే పరిమితం కాకుండా ఆరోగ్య అవగాహన కేంద్రాలుగా పనిచేస్తున్నాయని చైర్‌పర్సన్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ మణెమ్మ, సూపర్వైజర్ భారతి, ఏఎన్ఎం శిరీష, అంగన్వాడీ మరియు ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్
శుక్రవారం
17 ఏప్రిల్ 2026

# కోరుట్ల మున్సిపల్ అవినీతిపై సీడీఎంఏకు ఫిర్యాదు





**నేటి సాక్షి,కోరుట(రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని చారిత్రక గడి బురుజుల భూముల వ్యవహారంలో జరిగిన అక్రమాలపై ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్, అఖిలపక్షాల అధ్యక్షుడు చెన్న విశ్వనాథం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం జగిత్యాల జిల్లా పర్యటనకు రావాల్సిన సీడీఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి పర్యటన రద్దు కావడంతో, వారు ఈమెయిల్ మరియు వాట్సాప్ ద్వారా తమ ఫిర్యాదును అందజేశారు. గడి బురుజుల భూములకు సంబంధించి నకిలీ దస్తావేజులతో వాకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్టీ) కేటాయింపులు జరిగాయని, ఈ ప్రక్రియలో దాదాపు రూ.80 లక్షల మేర భారీ అవినీతి చోటుచేసుకుందని వారు ఆరోపించారు.

- **గడి బురుజుల భూముల వ్యవహారంలో రూ.80 లక్షల అవినీతి ఆరోపణలు**
- **నకిలీ దస్తావేజులతో వీఎల్టీల కేటాయింపుపై విచారణకు ప్రజాసంఘాల డిమాండ్**

సుమారు 3 ఎకరాల 21 గుంటల విస్తీర్ణంలో ఉన్న ఈ చారిత్రక గ్రామకంఠ భూములను ప్రైవేట్ వ్యక్తుల పేర్లపై మార్చేందుకు మున్సిపల్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా సహకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే నంబర్ లేకుండా పన్నులు వసూలు చేయడం, ఒకే ఆస్తిపై ద్వంద్వ పన్నుల విధానం అమలు చేయడం వంటివి అధికారుల పాత్రను ప్రశ్నార్థకం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో దిగువ స్థాయి సిబ్బందిని బలిపశువులను చేసే ప్రయత్నం జరుగుతోందని, అసలైన బాధ్యులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా కేటాయించిన వీఎల్టీలను రద్దు చేసి, ఆ భూములను పార్కులు, మార్కెట్ వంటి ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించాలని కోరారు. విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని ఉన్నతాధికారులను విన్నవించారు.

# రెండు నెలల్లో 20 కేసుల్లో 36 మందికి జైలు శిక్షలు




- **నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సత్కారం**
- **నేరం చేస్తే శిక్ష తప్పదు: ఎస్పీ అశోక్ కుమార్**
- **పోలీస్-పీపీ సమన్వయంతో శిక్షల శాతం పెంపు లక్ష్యం**

**నేటి సాక్షి,జగిత్యాల(రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లాలో నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటూ శిక్షల శాతాన్ని పెంచుతున్నామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. గడిచిన రెండు నెలల్లో 20 కేసుల్లో 36 మంది నిందితులకు జైలు శిక్షలు పడినట్లు వెల్లడించారు. జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కోర్టు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రామకృష్ణ రావు, ప్రణయ్, రాజేష్‌లను ఎస్పీ అశోక్ కుమార్ శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరం చేసిన వారికి ఖచ్చితంగా శిక్ష పడేలా చూడటం ద్వారా సమాజంలో భయభ్రాంతులు తగ్గి, శాంతి భద్రతలు మెరుగుపడతాయని అన్నారు. శిక్షల శాతం పెరగడం న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. నేరస్తులు శిక్షకు తప్పించుకోలేరనే భావన సమాజంలో బలపడాలని ఆయన అభిప్రాయపడ్డారు. నిందితులకు శిక్ష పడటంలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర అత్యంత కీలకమని ఎస్పీ తెలిపారు. కేసుల దర్యాప్తు నుండి కోర్టు విచారణ వరకు ప్రతి దశలో సమన్వయం ఉంటేనే ఫలితాలు సాధ్యమవుతాయని చెప్పారు. పోలీస్ అధికారులు, పీపీలు పరస్పరం సహకరిస్తూ సాక్ష్యాధారాలను బలంగా సమర్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. న్యాయాధికారులతో సమన్వయం పాటించడం ద్వారా నేరస్తులకు తగిన శిక్షలు పడేలా చూడవచ్చని వివరించారు. ముఖ్యంగా ప్రతి కేసును బాధ్యతగా తీసుకుని సమగ్రంగా పని చేయాలని ఆదేశించారు. జగిత్యాల జిల్లాలో పోక్సో, హత్య కేసులను అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి వేగంగా విచారణ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఇలాంటి కీలక కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు వంటి కఠిన శిక్షలు పడేలా కృషి చేయాలని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా అన్ని విధాలుగా సహకరించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. కేసులపై నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. గడిచిన రెండు నెలల్లో జిల్లాలోని వివిధ కోర్టుల్లో 20 కేసుల్లో నిందితులుగా ఉన్న 36 మందికి జైలు శిక్షలు విధించబడినట్లు ఎస్పీ వెల్లడించారు. ఇది పోలీస్ విభాగం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమిష్టి కృషి ఫలితమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కఠిన చర్యలు కొనసాగిస్తామని చెప్పారు. నేరాలను అరికట్టడంలో శిక్షల శాతం పెంపు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో నేరాలకు పాల్పడే వారికి ఇది గట్టి హెచ్చరికగా ఎస్పీ పేర్కొన్నారు. చట్టం ముందు ఎవరూ పెద్దవారు కాదని, నేరం చేసినవారు తప్పకుండా శిక్షను అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా బైరెడ్డి శబరి





**నేటి సాక్షి,పాములపాడు:** నూతనంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి గా నియమితులైన నంద్యాల ఎంపీ- డాక్టర్ బైరెడ్డి.శబరమ్మ కి ప్రభుత్వ టెలికం అడ్వైజర్ కమిటీ మెంబర్ & నియోజవర్గ టిడిపి యువ నాయకుడు కురువ రమేష్ హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం టిడిపి యువ నాయకుడు కురువ రమేష్ ఆధ్వర్యంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బైరెడ్డి శబరి ఎంపిక అయిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ కేక్ ను కటింగ్ చేసి, ఒకరికి ఒకరు తిరిగించుకొని సంతోషంగా సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు నంద్యాల జిల్లా రాజకీయ చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలిచే గర్వకారణమైన సంఘటన చోటుచేసుకుంది.

- **శబరికి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రభుత్వ టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్ కురువ రమేష్**

నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి చేస్తున్న విశిష్ట ప్రజాసేవలను గుర్తించిన తెలుగుదేశం పార్టీ అధిష్టానం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమెను జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించడం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. ముఖ్యంగా, ఈ పదవికి మొట్టమొదటిసారిగా ఒక మహిళను నియమించడం పార్టీ చరిత్రలోనే కాదు, రాష్ట్ర రాజకీయాల్లో కూడా ఒక చారిత్రాత్మక నిర్ణయంగా నిలిచిందన్నారు.

ఈ నియామకం మహిళా సాధికారతకు ప్రతీకగా నిలుస్తూ, రాజకీయాల్లో మహిళల పాత్రను మరింత బలపరిచే దిశగా ఒక గొప్ప ముందడుగుగా భావించబడుతోంది. శబరి నాయకత్వం, ప్రజల సమస్యలపై ఆమెకు ఉన్న అవగాహన, అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధత పార్టీని జాతీయ స్థాయిలో మరింత బలోపేతం చేయడంలో కీలకంగా నిలుస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజలతో సన్నిహితంగా మమేకమై, గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాలపై కృషి చేస్తున్న డాక్టర్ బైరెడ్డి.శబరి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి, రాష్ట్రం మరియు దేశ అభివృద్ధికి విశిష్ట సేవలు అందించాలని మేము మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నామని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, జిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు కురువ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్ భాష, వెంకటస్వామి, నాగరాజు, అలీ భాష, మధు, తదితరులు పాల్గొని, డాక్టర్ బైరెడ్డి.శబరి కి ఘనంగా అభినందనలు తెలియజేశారు.

## టిడిపి జాతీయ ప్రధాన ఎంపీ బైరెడ్డి

**శబరమ్మకు శుభాకాంక్షలు తెలియజేసిన సోషల్ వర్కర్ నవీన్ కుమార్ గౌడ్**

**నేటి సాక్షి, పాములపాడు:** నూతనంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నంద్యాల ఎం.పీ–డాక్టర్ బైరెడ్డి శబరమ్మకి, సమాజ సేవకుడు నవీన్ కుమార్ గౌడ్ హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాములపాడు మండలంలోని, లింగాల గ్రామంలో గ్రామస్తుల మధ్యన భారీ కేక్ ను కటింగ్ చేసి, ఒకరికి ఒకరు తినిపించుకొని సంతోషంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సమాజ సేవకుడు నవీన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలుగుదేశం పార్టీ పట్ల నిబద్ధత, అంకితభావం కలిగిన నాయకత్వాన్ని గుర్తించి, నూతన కమిటీలో అవకాశం కల్పించిన నారా చంద్రబాబు నాయుడు కి, నారా లోకేష్ బాబు కి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూజల మల్లీ, చిన్న అంబయ్య, అమృత, గ్రామ ప్రజలు, పెద్దలు, పిల్లలు పాల్గొనడం జరిగింది.





# మరికల్‌లో సర్వసభ్య సమావేశం



**నేటి సాక్షి, మరికల్(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ ఖలీల్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో వివిధ శాఖల మండల అధికారులు తమ శాఖల వారీగా సాధించిన ప్రగతి నివేదికలను సభకు సమర్పించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో పాల్గొన్న వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తమ పరిధిలోని పెండింగ్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఉపయోగపడే పనులను తక్షణమే పూర్తి చేయాలని, పరిష్కారం కాని సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను కోరారు. అనంతరం ప్రత్యేక అధికారి అబ్దుల్ ఖలీల్ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశం విజయవంతంగా ముగిసినందుకు అధికారులు, సర్పంచులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, కార్యాలయ పర్యవేక్షకులు మరియు ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# శివాలయ నిర్మాణానికి విరాళం



**నేటి సాక్షి,కోరుట్ల(రాధారపు నర్సయ్య):** కోరుట్లలో నూతనంగా నిర్మించ తలపెట్టిన ద్వాదశ జ్యోతిర్లింగ సహిత శ్రీ శివాలయానికి భక్తుల నుండి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో అయ్యప్ప దేవాలయ శాశ్వత సభ్యులు మచ్చ రాజేంద్ర ప్రసాద్–నివేదిత దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రూ.25,116 నగదును ఆలయ కమిటీకి విరాళంగా అందజేశారు. కోరుట్ల అయ్యప్ప స్వామి దేవాలయం ఆధ్వర్యంలో సుమారు రూ.3 కోట్ల భారీ వ్యయంతో ఈ ఆలయ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. పన్నెండు జ్యోతిర్లింగాల ప్రతిరూపాలతో ప్రత్యేకంగా రూపుదిద్దుకోనున్న ఈ శివాలయం, భక్తులకు ఒక గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని దేవాలయ కమిటీ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ గురుస్వామి పేర్కొన్నారు. ఈ పవిత్రమైన నిర్మాణ క్రతువులో భక్తులు తమకు తోచిన ఆర్థిక సహాయం అందించి భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. దాతల సహకారంతో నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులకు భయపడం

**ప్రజా సమస్యలపై పోరాటం ఆగదు.బీజేపీ**



నేటి సాక్షి.గజ్వేల్ : గజ్వేల్ నియోజకవర్గ ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్న బీజేపీ నాయకులను అక్రమ కేసులతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆ పార్టీ నాయకులు మండిపడ్డారు. 2022లో గత టీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టినందుకు తమపై నమోదైన కేసుకు సంబంధించి, గురువారం బీజేపీ నాయకులు గజ్వేల్ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారు మహేష్ మాట్లాడుతూ.. ప్రజల గొంతుకగా నిలిచిన తమపై అక్రమ కేసులు బనాయించి, కోర్టుల చుట్టూ తిరిగేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం బాటలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కోర్టుకు హాజరైన నాయకులకు మద్దతుగా రాష్ట్ర నాయకులు ఏళ్ళు రాంరెడ్డి, కోదండం శ్రీనివాస్ రెడ్డి తరలివచ్చారు. కోర్టుకు హాజరైన వారిలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, సీనియర్ నాయకులు ఉప్పల మధుసూదన్, నత్తి శివకుమార్, పంజాల వెంకటేష్ గౌడ్, అరికెల కరుణాకర్, బైండ్ల నాంపల్లి తదితరులు ఉన్నారు. తమకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందని, ప్రజా క్షేత్రంలో ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని నాయకులు స్పష్టం చేశారు.

## అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి



**నేటి సాక్షి,చిలుకూరు:** మండల అభివృద్ధిలో అధికారులు మరియు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సహకరించాలని జిల్లా అధికారి దయానంద రాణి సూచించారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి గ్రామసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను, సర్పంచులను మరియు గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహించకూడదని, ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందేలా చూడటం అందరి బాధ్యతని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు, ఎమ్మార్వో ధ్రువ కుమార్, ఎస్ఐ హనుమాన్ నాయక్, సర్పంచ్ కొల్లు పులమ్మ నాగయ్య, రెవెన్యూ అధికారులు, వివిధ గ్రామాల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు మరియు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఇర్కిగూడెంలో క్రికెట్ టోర్నమెంట్



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల మండల పరిధిలోని ఇర్కిగూడెం గ్రామంలో ఎన్ జె సీఎం యూత్ ఆధ్వర్యంలో మెగా టోర్నమెంట్ ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఇర్కిగూడెం గ్రామ సర్పంచ్ పద్మ సత్యనారాయణ, అండ్ ఇండియా సిమెంట్ అల్ట్రాటెక్ యజమాన్యం, గ్రామ పెద్దలు యూత్ అందరు కలిసి ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ లో మొదటి బహుమతి రూ. 20వేలు అండ్ బహుమతి, రెండో బహుమతి రూ. 10వేలు రూపాయలు బహుమతి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈక్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్స్ గా జి.రాజు, కే మరియదాస్, జి.సత్యం, జి. సురేందర్, కే. ఆనంద్, జి. సైదులు, కే. నాగేష్ ఆర్గనైజర్ వ్యవహరించనున్నట్లు తెలిపారు.

## డీసీసీబీ నూతన శాఖ ప్రారంభం

### రైతులకు మరింత వెసులుబాటు




**నేటి సాక్షి,చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో నల్గొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ణజజదీ) నూతన శాఖ నేడు ప్రారంభం కానుంది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ నూతన శాఖను స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిలుకూరు మండల కేంద్రంలో నూతన శాఖ ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. బ్యాంకు ద్వారా లభించే రుణాలు, ఇతర ఆర్థిక సేవలు నేరుగా రైతులకు దరిచేరడం వల్ల వారికి సాగు పనుల్లో వెసులుబాటు కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, బ్యాంక్ ఉన్నతాధికారులు మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

# నేరాల నివారణ దర్యాప్తుపై దృష్టి పెట్టాలి







- పెండింగ్ కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలని ఆదేశం
- జగిత్యాల జిల్లా క్రైమ్ మీటింగ్‌లో పోలీస్ అధికారులకు దిశానిర్దేశం

**నేటి సాక్షి,జగిత్యాల:** జగిత్యాల జిల్లాలో నేరాల నివారణతో పాటు, నమోదైన కేసులను త్వరితగతిన ఛేదించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మరియు మహిళలపై జరుగుతున్న నేరాలకు సంబంధించి దర్యాప్తును వేగవంతం చేసి, సకాలంలో కోర్టుల్లో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని స్పష్టం చేశారు. నేరస్తులకు శిక్ష పడేలా పక్కా సాక్ష్యాధారాలతో కేసులను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా సరిహద్దుల గుండా జరుగుతున్న గంజాయి రవాణాను అడ్డుకోవడానికి మరియు హిస్టరీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. వేసవి నేపథ్యంలో దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలన్నారు. 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 'అరైవ్–అలైవ్' కార్యక్రమాల ద్వారా రోడ్డు భద్రత మరియు సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. రానున్న బక్రీద్, హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఈ సందర్భంగా ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీలు వెంకటరమణ, రఘుచందర్, రాములు మరియు జిల్లాలోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

# సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం




నేటి సాక్షి,నారాయణపేట: చిన్నారులు, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ సీడీపీఓ ఆర్. మమత కోరారు. ఏప్రిల్ 9 నుండి 23 వరకు నిర్వహించే 'పోషణ పక్వాడ'లో భాగంగా గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి పోషకాహారం ఎంతో అవసరమని, ముఖ్యంగా ప్రారంభ సంవత్సరాల్లో ఆటపాటలతో కూడిన విద్యపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లల్లో మొబైల్ ఫోన్లు, టీవీల ప్రభావం (స్క్రీన్ టైమ్) తగ్గించడంలో సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో లభించే చిరుధాన్యాల వంటకాలు, టీహెచ్‌ఆర్, గ్రోత్ మానిటరింగ్ మరియు కౌన్సెలింగ్ వంటి ఉచిత సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆమె వివరించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన వివిధ రకాల పోషకాహార వంటకాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అంగన్వాడీల మౌలిక సదుపాయాల మెరుగుదలకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఓ వెంకట్ రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీఓ శేషగిరి శర్మ, ఎంపీఓ రమేష్, ఎస్సై లక్ష్మయ్య, ఎంఈఓ ధర్మానాయక్, సూపర్వైజర్లు వాణి, రాధిక, హేమా దేవి, నిహారిక, బ్లాక్ కో–ఆర్డినేటర్ కవిత, సర్పంచులు మరియు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్వాహకుల నిర్లక్ష్యం.. యువకుడి ప్రాణం బలి





**నేటి సాక్షి, గజ్వేల్:** భద్రతా ప్రమాణాలు పాటించకుండా, ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్ ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని తూప్రాన్ రోడ్డు శివారులో గత 15 ఏళ్లుగా కొనసాగుతున్న ఒక స్విమ్మింగ్ పూల్‌లో వంశీ (26) అనే యువకుడు ఈతకు వెళ్లి మృతి చెందాడు. గురువారం ఉదయం ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు వంశీ నీటిలో మునిగిపోగా, అక్కడ కాపాడటానికి కనీసం లైఫ్ గార్డులు లేకపోవడంతో యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. నిర్వాహకులు కేవలం లాభాపేక్షతోనే నడుపుతున్నారని, కనీస రక్షణ చర్యలు చేపట్టలేదని స్థానికులు మండిపడుతున్నారు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న గజ్వేల్ ఏసీపీ నర్సింలు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడి సర్దిచెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రమాదాల నివారణకే 'అరైవ్ అలైవ్'





- డ్రైవర్లకు ఉచిత నేత్ర పరీక్షలు

**నేటి సాక్షి,మెట్‌పల్లి(రాధారపు నర్సయ్య):** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జగిత్యాల జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో డ్రైవర్లకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డీఎస్పీ ఏ. రాములు నేతృత్వంలో జరిగిన ఈ శిబిరంలో ఆటో, టాక్సీ, లారీ మరియు ఆర్టీసీ డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మెట్‌పల్లిలోని సాయి శ్రీనివాస్ ఐ హాస్పిటల్ సహకారంతో సుమారు 108 మంది డ్రైవర్లకు ఆధునిక పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించి, చూపు సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఏ. రాములు మాట్లాడుతూ.. డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన చూపు ఎంత ముఖ్యమో వివరించారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం మరియు చూపు మందగించడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, డ్రైవర్లు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం ప్రతి డ్రైవర్ బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. సీఐ వి. అనిల్ కుమార్, ఎస్ఐ పి. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అధినేత బెజ్జారపు శ్రీనివాస్, వైద్య బృందం మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# ప్రమాదాల నివారణకు సీట్ బెల్ట్ తప్పనిసరి



● జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్

నేటి సాక్షి, సిరిసిల్ల (శివకుమార్): రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన 'అర్రైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చౌరస్తాలో గురువారం సీట్ బెల్ట్ ధరించడంపై రవాణా మరియు పోలీస్ శాఖల ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్, పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మరియు రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వాహనదారులకు అవగాహన కల్పిస్తూ.. ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ ధరించి వాహనం నడపాలని, సీట్ బెల్ట్ పెట్టుకోకపోతే ప్రమాద సమయంలో ఎయిర్ బ్యాగులు తెరుచుకోక ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. కేవలం డ్రైవర్లు మాత్రమే కాకుండా, వాహనంలోని ఇతర ప్రయాణికులు కూడా తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం తాగి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపవద్దని వారు సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ఉత్తమ పౌరులుగా మెదలాలని కోరారు. అనంతరం వాహనదారులందరితో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. నిబంధనలు పాటిస్తూ సీట్ బెల్ట్ ధరించిన వాహనదారులను ప్రోత్సహిస్తూ వారికి వినూత్నంగా మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పృథ్వీరాజ్ వర్మ, ట్రాఫిక్ పోలీసులు మరియు సుమారు 300 మంది వాహనదారులు పాల్గొన్నారు.

# ఆమనగల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం




నేటి సాక్షి,మిర్యాలగూడ : రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ఎస్ కే జే వై (స్కజై) నేచర్ గ్రీన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ అండగా నిలుస్తుందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పుట్టల శైలజ తెలిపారు. గురువారం వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలోని శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ విస్తరణాధికారి ధీరావత్ నితిన్ నాయక్, గ్రామ పరిపాలన అధికారి నర్సయ్యతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఆమనగల్లుతో పాటు పరిసర గ్రామాల రైతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని ఆమె కోరారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వల్లంపట్ల అబ్రహం, రైతులు మేక మాణిక్యం, పెరుమాళ్ళ జోజి, వల్లంపట్ల కోటయ్య, భయ్యా సైదులు, మెరుగు సుందరయ్య, దామెర్ల అంజయ్య, ముండ్ల కళ్యాణ్ యాదవ్, నార్ల అంతయ్య, గొట్టిపర్తి జాను, మాతంగి గురువయ్య, మెరుగు భరత్, వల్లపుదాసు శ్రవణ్, పానుగండ్ల హరి మరియు హమాలీలు పాల్గొన్నారు.

# ప్రజాపాలన సభలో కలకలం

## కలెక్టర్ ఎదుటే మహిళ ఆత్మహత్యాయత్నం



- ఇందిరమ్మ ఇల్లు రాలేదన్న ఆవేదనతో పురుగుల మందు తాగిన కోట సునీత
- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధితురాలి ఆరోపణ.. కోదాడ ఆసుపత్రికి తరలింపు



నేటి సాక్షి,మునగాల : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలన వేదికపైనే ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం సూర్యాపేట జిల్లా మునగాలలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గురువారం మునగాల మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' సమావేశం జరుగుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. తాడ్వాయి గ్రామానికి చెందిన కోట సునీత అనే మహిళ తనకు ఇందిరమ్మ ఇల్లు రావడం లేదని, అర్హత ఉన్నా అధికారులు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ అందరూ చూస్తుండగానే వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగింది. సునీత అకస్మాత్తుగా కుప్పకూలడంతో అధికారులు, పోలీసులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆమెను పోలీస్ వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందుతోందని, పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత లేదని, పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా అధికారులు స్పందించకపోవడం వల్లే ఆమె ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారుల సమక్షంలోనే ఇలాంటి ఘటన జరగడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం స్పందించి అర్హులైన తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# తడి-పొడి చెత్తను వేరు చేయాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్



నేటి సాక్షి,ఆసిఫాబాద్(ఎండి ముబీన్): పరిశుభ్రమైన పట్టణ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ సూచించారు. 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 20వ వార్డులో నిర్వహించిన పారిశుధ్య పనులు మరియు అవగాహన సదస్సులో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం మహిళలు 'హోమ్ కంపోస్టింగ్' పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని, తడి చెత్తతో ఇంట్లోనే సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చని తెలిపారు. పట్టణ అభివృద్ధికి ప్రజలు తమ ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి సహకరించాలని వారు కోరారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తుగా పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం కల్పిస్తున్న 5 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వార్డులో దోమల నివారణకు మందు పిచికారీ చేయించి, మురుగు కాలువల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. స్థానిక చిల్డ్రన్స్ పార్కును సందర్శించి, ఎండల తీవ్రత దృష్ట్యా మొక్కలకు నిత్యం నీరు పోయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గజానంద్, కౌన్సిలర్లు జెబా షేక్, చిలువేరు వెంకన్న, నాయకులు సమద్, ఎత్తేశం మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రగతి ప్రణాళిక అమలుపై గజ్వేల్‌లో సమీక్ష సమావేశం



నేటి సాక్షి గజ్వేల్: ప్రజాపాలనలో భాగంగా చేపట్టిన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం కింద గజ్వేల్ మండలం IOC 'జ' బ్లాక్ లో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి శ్రీమతి జి. సువర్ణ గారు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరై ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ముఖ్యంగా రైతు భరోసా, రైతు రుణ మాఫీ, గృహలక్ష్మి, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు తదితర పథకాల అమలు విధానం, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీ ఏ. ప్రవీణ్, మండల పంచాయతీ అధికారి శ్రీ ఆర్. దయాకర్, మండల వ్యవసాయ అధికారి శ్రీ నాగరాజు, తహసీల్దార్ శ్రీ స్వామి పాల్గొన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, మహిళా మండలి సభ్యులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు

# ప్రగతి ప్రణాళికతోనే అభివృద్ధి

ప్రత్యేక అధికారి సరస్వతి



నేటి సాక్షి,గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్): గన్నేరువరం మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి మరియు మండల ప్రత్యేక అధికారి సరస్వతి పర్యవేక్షణలో, ఎంపీడీవో ఏ. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రభుత్వ పథకాల అమలుపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ పథకం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ మరియు సన్న వడ్లకు బోనస్ వంటి అంశాలను ప్రజలకు చేరవేయడంలో యంత్రాంగం నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా చేయూత పింఛన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు ఇందిరా మహిళా శక్తి ద్వారా స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాల అందజేతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు, విద్యా, వైద్య రంగాల్లో మెరుగైన సేవలు అందించేలా కార్యాచరణ రూపొందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కనకయ్య, ఎస్సై జి. నరేందర్ రెడ్డి, ఎంపీఓ సురేందర్, మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చెయ్యాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్.



నేటి సాక్షి వికారాబాద్ : పార్లమెంటులో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దేశ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు బాధకారం ఆయన తెలివితక్కువ తనం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్, భారత్ విభజనతో పోల్చడం సరికాదు. రాజ్యాంగానికి అనుగుణంగా, పార్లమెంట్ ఆమోదంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని మీకు తెలియదా తేజస్వి గారు? తెలిసి ఇలాంటి వ్యాఖ్యలు చెయ్యటం ఎంతవరకు సమంజసం? అవగాహనా లేమితో ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు సైతం సమర్ధించడం సిగ్గుచేటు. రాంచందర్ రావు గారు వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. బీజేపీ ఎంపీలు తేజస్వీ సూర్య గారి వ్యాఖ్యలను ఖండించాలి. తేజస్వీ సూర్య మాటలకు మద్దతు తెలిపే ఎంపీ ల సభ్యత్వం సైతం రద్దు చెయ్యాలి. తేజస్వీ సూర్య వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ క్షమాపణ చెప్పాలి.

# మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

సర్పంచ్ తైదల అంజయ్య



నేటి సాక్షి, కొడిమ్యాల: కొడిమ్యాల మండలం తిరుమలాపూర్ గ్రామంలో సర్పంచ్ తైదల అంజయ్య. ఉపసర్పంచి ప్రశాంత్ రెడ్డి. పాలకవర్గం. కలిసి ఎండాకాలంలో ఏ పని లేక ఉన్న పేదలు ఎండకు నీళ్లు కూడా లేని గుట్ట ప్రదేశంలో ఉపాధి హామీ పనిచేసుకునే కూలీలకు వాళ్ళ భద్రత గురించి తలకు గుడ్డ కట్టుకొని నీళ్లు ఎప్పుడూ వెంబడే ఉంచుకొని ఆరోగ్యం కాపాడుకుంటూ పని చేసుకోవాలని సూచించి 170 మంది కూలీలకు మజ్జిగ పాకెట్స్ పంపిణీ చేయడం జరిగింది

# గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం



**నేటి సాక్షి,ఆసిఫాబాద్(ఎండి ముబీన్):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన గ్రంథాలయ చైర్మన్ అనిల్ కామ్డే మరియు డీసీసీ సెక్రటరీ బాదావత్ శివప్రసాద్ నాయక్‌లను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ముఖ్య అతిథిగా హాజరై, బాధ్యతలు స్వీకరించిన వారికి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవులు బాధ్యతతో కూడుకున్నవని, నూతన కార్యవర్గం ప్రజలకు మరియు విద్యార్థులకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రంథాలయాల బలోపేతానికి, అలాగే పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాపర్తి కార్తీక్, వార్డు సభ్యులు గులాం జావిద్, కొమరం వేణు, టౌన్ ప్రెసిడెంట్ రఫిక్ అహ్మద్ పాల్గొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్లా, నిఖిల్, రాజేందర్, జాలిమ్, కొండూ సాయి, జమీర్ అహ్మద్, బండి సాయి తదితరులు పాల్గొని నూతన బాధ్యులకు అభినందనలు తెలియజేశారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి, సహకరించిన కార్యకర్తలకు బాధ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతిఘటిస్తేనే సమస్యల పరిష్కారం


**తపస్ జిల్లా అధ్యక్షులు నరసింహ**



**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** ప్రభుత్వంపై ముక్తకంఠంతో బలంగా ప్రతిఘటిస్తేనే పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు పరిష్కారమవుతాయని తపస్ (TAPAS) జిల్లా అధ్యక్షులు నరసింహ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీ నాటికి ప్రభుత్వం నూతన పీఆర్సీ (PRC) ప్రకటించని పక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. టీజీఈ జేఏసీ (TGE JAC) ఆధ్వర్యంలో చేపట్టిన దశల వారీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శుక్రవారం (ఏప్రిల్ 17న) జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో తహశీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జేఏసీ పిలుపునిచ్చిన ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మరియు సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**ఏసీపీ తిరుపతిరెడ్డి**



**నేటి సాక్షి,తిరుమలాయపాలెం(రుద్రరాజు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అవగాహన సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఈ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, హెల్మెట్ మరియు సీటు బెల్ట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని, ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం ఆత్మహత్యతో సమానమని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతను సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి సీఐ సంజీవ్, స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. వీరితో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, రాజకీయ నాయకులు మరియు ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు.

# కలకోవలో చలివేంద్రం ప్రారంభం

**బాటసారుల దాహార్తి తీర్చడమే లక్ష్యం**



**నేటి సాక్షి,మునగాల :** వేసవి కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు మునగాల మండల పరిధిలోని కలకోవ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని సర్పంచ్ మండవ వెంకటాద్రి ప్రారంభించి మాట్లాడారు. ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న కూలీలు, రైతులు మరియు బాటసారులకు చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో సామాజిక బాధ్యతగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామ ప్రధాన రహదారిపై అందుబాటులోకి వచ్చిన ఈ చలివేంద్రం ద్వారా ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు ఉపశమనం పొందుతున్నారు. వేసవి కాలం ముగిసే వరకు ఈ కేంద్రాన్ని నిరంతరంగా కొనసాగిస్తామని పంచాయతీ పాలకవర్గం స్పష్టం చేసింది. గ్రామ సర్పంచ్ తీసుకున్న ఈ చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ యువత, స్థానిక నాయకులు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా పాటించి ప్రాణాలు కాపాడుకోవాలి





**నేటి సాక్షి,వికారాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా, జిల్లావ్యాప్తంగా 'అరైవ్ అలైవ్' (ూతీతీఱఙవ చాశ్రీఱఙవ) రోడ్డు భద్రతా వారోత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు మూడవ రోజున జిల్లావ్యాప్తంగా 'చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే'ను ఘనంగా నిర్వహించారు. వికారాబాద్, తాండూర్, పరిగి, దౌల్తాబాద్‌తో పాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు పాఠశాల విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించారు. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్ నిరోధించడం, హెల్మెట్ మరియు సీటు బెల్ట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జీబ్రా క్రాసింగ్ వద్ద రోడ్డు దాటే పద్ధతులు, స్కూల్ బస్సుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. నవాబ్‌పేట్, పెద్దేముల్, దోమ తదితర ప్రాంతాల్లో 'నాన్న నా కోసం హెల్మెట్ కొను' అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని లేఖలు రాయించే కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. పలు మండలాల్లో స్కూల్ జోన్ బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రధాన కూడళ్లలో విద్యార్థులు, పోలీసులు కలిసి మానవహారంగా ఏర్పడి రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# బుగ్గారం మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్దాం



- ఎంపీడీవో అనుమల్ల వాసవి
- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి:తహసిల్దార్ భూమేశ్వర్
- 99 రోజుల యాక్షన్ ప్లాన్ విజయవంతం

**నేటి సాక్షి, బుగ్గారం:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలోని శ్రీ ముత్యాల పోచమ్మ నల్ల పోచమ్మ ఆలయ ఫంక్షన్ హాల్ లో గురువారం నిర్వహించిన మండల స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం ఇన్చార్జి ఎంపిడిఓ అనుమల్ల వాసవి అధ్యక్షతన విజయవంతమైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా మండలంలోని 10 గ్రామాల ప్రజాప్రతినిధులతో మండల స్థాయి సమావేశం ఎంపీడీవో అనుమల వాసవి నిర్వహించారు. దీనిలో భాగంగా ముందుగా దీపారాధన అనంతరం తెలంగాణ గీతం, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా 10 గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమాల వీడియోలను ఫోటోలను డిజిటల్ మాధ్యమాలలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల స్పెషల్ ఆఫీసర్ సుజాత ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన నిరుపేదలు తప్పనిసరిగా పొందాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలు శాఖల అధికారులు మాట్లాడుతూ మండల పరిధిలోగల వనరులను లబ్ధిదారులుగా ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. బుగ్గారం తహసిల్దార్ మాట్లాడుతూ భూభారతిలో జరిగిన మార్పులను వివిధ పథకాల ద్వారా మండలంలోని ప్రజలు పొందుతున్న సేవలను లబ్ధిని తెలిపారు. సభ అధ్యక్షత వహించిన ఇన్చార్జ్ ఎంపీడీవో వాసవి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న సంక్షేమ గురించి వివరిస్తూ సర్పంచులు వార్డు సభ్యులైన ప్రజాప్రతినిధులందరూ కలిసికట్టుగా పనిచేస్తూ ప్రజలకు కావలసిన వసతులన్నీ కల్పించే దిశగా పనిచేయాలని తెలిపారు ఇలా ఐకమత్యంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న మీ మీ ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారం కోసం మేము కృషి చేసినందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. తదనంతరం విద్యుత్ శాఖ ఏఈ, వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారి, హెల్త్ సూపర్వైజర్, ఐసిడిఎస్, సిడిపిఓ, ఏపీడీపీఓ, సూపర్వైజర్, డిఆర్డిఏ, సిసి పిఆర్ఏ, ఇరిగేషన్ ఎఈ, పలు శాఖల అధికారులు పాల్గొని మాట్లాడారు.

# ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రాణాలను కాపాడుకోవాలి




**నేటి సాక్షి,మునగాల :** రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి పౌరుడి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే విలువైన ప్రాణాలను కాపాడుకోగలమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ నరసింహ అన్నారు. మునగాల మండల పరిధిలోని ఆకుపాముల మాంటిస్సోరి పాఠశాల వేదికగా గురువారం నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు సమాజానికి సవాలుగా మారాయని, చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాలను రోడ్డున పడేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని స్పష్టం చేశారు. అనంతరం ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ మాట్లాడటం వంటివి ప్రమాదాలకు ప్రధాన కారణాలని హెచ్చరించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల బస్సు డ్రైవర్లకు ప్రత్యేక సూచనలు చేస్తూ, చిన్నారుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు రోడ్డు భద్రతపై ప్రాక్టికల్ డెమోలు నిర్వహించి, అందరితో "రోడ్డు భద్రత – నా బాధ్యత" అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞా, గాయత్రి పాఠశాలల ఉపాధ్యాయులు, బస్సు డ్రైవర్లు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



**ఫైర్ ఆఫీసర్ డాక్టర్ బాబు**

నేటి సాక్షి,కోదాడ: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని సిరి అపార్ట్‌మెంట్‌లో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అగ్నిమాపక అధికారి డాక్టర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై, నివాసితులకు అగ్నిప్రమాదాల నివారణపై కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా వంట గ్యాస్ లీకేజీ సంభవించినప్పుడు అనుసరించాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తూ.. గదిలో విద్యుత్ స్విచ్‌లు ఆన్ చేయకూడదని, వెంటనే కిటికీలు, తలుపులు తెరిచి గాలి ఆడేలా చూడాలని సూచించారు. లీడింగ్ ఫైర్ ఫైటర్ శ్రీనివాస్ రావు, ఫైర్ ఫైటర్ శ్రీనివాస్ సాయంతో అగ్నిప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అదుపు చేయాలో ప్రాక్టికల్ డెమో ద్వారా నివాసితులకు ప్రత్యక్షంగా చూపించారు. అత్యవసర సమయాల్లో భయాందోళనకు గురికాకుండా అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని, పిల్లలు మరియు వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ మహిళలు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం పట్ల నివాసితులు హర్షం వ్యక్తం చేశారు.

# వరిగడ్డి అగ్నికి ఆహుతి..

**రైతుకు భారీ నష్టం, సహాయం కోరిన బాధితుడు**

**నేటి సాక్షి :** పెద్దకడబూరు మండల కేంద్రానికి చెందిన రైతు బొగ్గుల దేవన్నకు చెందిన సుమారు నాలుగు ఎకరాల వరిగడ్డి అగ్నికి ఆహుతి కావడంతో ఆయనకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. ఘటన జరిగిన సమయంలో ఎవరూ లేని పరిస్థితిని ఉపయోగించుకుని గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు రైతు అనుమానం వ్యక్తం చేశారు. పశువులకు ఆహారంగా ఉపయోగించేందుకు కష్టపడి నిల్వ ఉంచిన వరిగడ్డి కళ్లముందే మంటల్లో కాలిపోవడంతో రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ఈ ఘటనతో ఒక్కసారిగా తన జీవనాధారంపై ప్రభావం పడిందని, పశువుల పోషణ కూడా కష్టమవుతుందని ఆయన వాపోయారు. మంటలు వేగంగా వ్యాపించి కొద్దిసేపట్లోనే మొత్తం వరిగడ్డి బూడిదగా మారినట్లు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.80 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్థిక సహాయం అందించాలని, తనలాంటి చిన్న రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు.



# రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం





**నేటి సాక్షి , ఎమ్మిగనూరు:** మంత్రాలయం మండలం చిలకలడోణ గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆయన, ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ ఘటనతో బాధిత కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయని పేర్కొంటూ, పార్టీ తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. మృతదేహాలను వారి స్వగ్రామాలకు తరలించేందుకు ప్రభుత్వం తరపున అంబులెన్సులు ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రమాదం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాఘవేంద్ర రెడ్డి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

# ప్రగతి ప్రణాళికపై మండల స్థాయి సమీక్ష




- 99 రోజుల కార్యక్రమం వేగవంతంపై చర్చ
- అధికారుల పనితీరుపై సర్పంచుల అసంతృప్తి



**నేటి సాక్షి, ఎండపల్లి:** ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంపై ఎండపల్లి మండలంలో నిర్వహించిన సమీక్ష సమావేశం స్థానిక సమస్యలకు వేదికైంది. గురువారం రాజారాంపల్లి గ్రామంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో మండల పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రత్యేక అధికారి ఎం. రవి ప్రసాద్ హాజరయ్యారు. సర్పంచ్‌లు, అధికారులు కలిసి మార్చి 6 నుంచి జూన్ 12 వరకు కొనసాగుతున్న 99 రోజుల కార్యక్రమంపై సమీక్ష చేపట్టారు. సంక్షేమ పథకాల అమలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై సర్పంచ్‌లు వివరాలు వెల్లడించారు. అయితే పథకాల అమలులో జాప్యాలు, లోపాలు ఉన్నాయని పేర్కొంటూ పలు శాఖల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మద్దుల గోపాల్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి అర్హులకు సకాలంలో లబ్ధి చేకూరేలా చూడాలని, చేపట్టిన ప్రజా పాలన లక్ష్యాలను సఫలీకృతం చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి మాట్లాడుతూ పథకాలు ప్రజలకు చేరాలంటే అధికారుల పనితీరులో పారదర్శకత, వేగం అవసరమని అన్నారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు శాఖల మధ్య సమన్వయం పెరగాలని సూచించారు. అధికారులు మాత్రం సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వివరించారు. అయితే పలు శాఖల పనితీరుపై సర్పంచ్‌ల అసంతృప్తి వ్యక్తమవడం గమనార్హంగా నిలిచింది. 'ప్రజా పాలన' కార్యక్రమం గ్రామస్థాయిలో ఫలితాలివ్వాలంటే స్థానిక సమస్యల పరిష్కారంపై అధికారులు మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అనంతరం సర్పంచ్ లకు, అధికారులకు శాలువాలతో సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, వ్యవసాయ అధికారి కమల్ల మహేష్, ఎంఈఓ సముద్రాల హరికృష్ణ, వైద్యాధికారి పి.లవ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ బండి సమ్మయ్య, ఏపీఎం తులసి మాత, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆండాలు, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, ఆశా వర్కర్లు, మహిళా సంఘం సభ్యులు, నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మంత్రాలయం సమీపంలో ఘోర రోడ్డు



## 8 మంది మృతి, పలువురికి గాయాలు

**నేటి సాక్షి,కర్నూలు:** జిల్లాలోని మంత్రాలయం మండలం చిలకలడోణ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రం నుంచి మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తున్న భక్తులతో ప్రయాణిస్తున్న బొలెరో వాహనం ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో బొలెరోలో ప్రయాణిస్తున్న వారిలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఐదుగురు ఘటనాస్థలిలోనే మృతి చెందగా, మరికొందరు చికిత్స పొందుతూ మరణించినట్లు సమాచారం. మరో 10 మంది వరకు గాయపడినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన వారు కర్ణాటక రాష్ట్రానికి చెందినవారిగా గుర్తించారు. గాయపడిన వారిని తక్షణమే సమీపంలోని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్..

## డ్రైవర్ నిద్రమత్తే కారణమని ప్రాథమిక నిర్ధారణ



**నేటి సాక్షి:** మంత్రాలయం మండలం చిలకలడోణ సమీపంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం అనంతరం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఘటనాస్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలపై స్థానిక పోలీసు అధికారులను అడిగి తెలుసుకుని, సంఘటనపై పూర్తి స్థాయి వివరాలు సేకరించారు. పోలీసులు వెల్లడించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, బొలెరో వాహనం డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు గుర్తించారు. తెల్లవారుజామున ప్రయాణం కొనసాగుతుండగా డ్రైవర్ అప్రమత్తత కోల్పోయి వాహనాన్ని కుడివైపుకు మళ్లించడంతో, ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టినట్లు అధికారులు తెలిపారు. ఢీకొన్న వేళ తీవ్ర ప్రభావంతో భారీ ప్రమాదం చోటుచేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనానికి అవసరమైన పర్మిట్ లేకపోవడం కూడా బయటపడినట్లు ఎస్పీ తెలిపారు. ఇది కూడా నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొంటూ, వాహన యజమానులు చట్టపరమైన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిస్తూ, వాహనదారులు రహదారి భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని, ముఖ్యంగా డ్రైవర్లు అలసట లేదా నిద్రమత్తులో వాహనం నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రయాణ సమయంలో విరామాలు తీసుకుంటూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

# కురవి మండలంలో రాజకీయ రగడ

## కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం



**నేటి సాక్షి,మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' మండల సభ రాజకీయ రణరంగంగా మారింది. అభివృద్ధి పనులపై చర్చించాల్సిన వేదిక కాస్తా.. ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఉద్రిక్తంగా మారింది. గ్రామ పంచాయతీల నిధులు, అభివృద్ధి పనుల అమలుపై చర్చ జరుగుతుండగా.. బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ సర్పంచ్ మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ అభివృద్ధి విషయంలో రాజకీయ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో సభలో ఒక్కసారిగా నిశ్శబ్దం విడిపోయి ఆగ్రహావేశాలు వెల్లువెత్తాయి. ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అవిరె మోహన్ రావు తీవ్రంగా ఖండించారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని, అభివృద్ధి పారదర్శకంగా జరుగుతోందని ఆయన ఘాటుగా స్పందించారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి పరిస్థితి అదుపుతప్పింది. నేతలు ఒకరిపై ఒకరు దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతో సభలో తోపులాట జరిగి ఉద్రిక్తత తారాస్థాయికి చేరింది. అక్కడ ఉన్న అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మరియు ఇతర అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. అధికారుల హెచ్చరికల అనంతరం పరిస్థితి సద్దుమణగడంతో సమావేశాన్ని మళ్లీ కొనసాగించారు. ఈ ఘటన మండలంలో రాజకీయంగా పెను చర్చకు దారితీసింది.

# కేసీఆర్ బహిరంగ సభ

## ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు, కొప్పుల ఈశ్వర్



**నేటి సాక్షి,ఎండపల్లి:** జగిత్యాలలో ఈ నెల 20న నిర్వహించనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని సభ ఏర్పాట్లు, జన సమీకరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుమారు లక్ష మందితో నిర్వహించ తలపెట్టిన ఈ సభకు ధర్మపురి నియోజకవర్గం నుండి 15 వేల మంది కార్యకర్తలు తరలివచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని కోరారు. ఇతర పార్టీల నుండి బీఆర్ఎస్‌లోకి చేరుతున్న వారి సంఖ్య పెరగడం పార్టీ బలోపేతానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. అంతకుముందు స్థానిక నేతలు వారికి శాలువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సింహాచలం జగన్, నాయకులు ఏలేటి కృష్ణారెడ్డి, గాజుల మల్లేశం, మారం జలేందర్ రెడ్డి, గాధం భాస్కర్, పడిదం నారాయణ, వెంకటేష్, రాజేష్, మల్లేష్, మెరుగు జానీ, ముక్తి చందు, వన్నెల దామోదర్ రెడ్డి మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.